ఆధునిక సాగు.. లాభాలు బాగు

- మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి
- తెగుళ్లు, పురుగుల నివారణ సులభం
- కలుపు మొక్కలకు కళ్లెం
- తక్కువ నీటితో అధిక దిగుబడి



మల్చింగ్ పద్ధతితో సాగు చేసిన చామంతి

అట్లూరు: రైతులు సాగు చేసిన పంటలపై అతివృష్టి, అనావృష్టి వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపిస్తున్నాయి. దీనికితోడు దిగుబడులు రాక పెట్టుబడులు చేతికందక తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేవైపు అడుగులు వేస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన ప్లాస్టిక్ మల్చింగ్ విధానం ద్వారా నేలలోని తేమను కాపాడుకోవడంపాటు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. ఈ విధానం రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా కమర్షియంల్ పంటలైన దోస (మస్క్ మిలన్) కలింగర (వాటర్‌మిలాన్) బంతి, టమాటా, మిరప తదితర పంటలకు మల్చింగ్ విధానంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఉద్యాన పంటలను మల్చింగ్ విధానం ద్వారా సాగు చేస్తే మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు క్రిమి కీటకాలతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందని వ్యవసాయ నిపుణులు చెపుతున్నారు.

జిల్లావ్యాప్తంగా..

జిల్లాలో ఇప్పటికే దోస, కలింగర, బంతిపూలు, టమాటా తదితర పంటలు మల్చింగ్ విధానం ద్వారా సాగు చేస్తున్నారు. బద్వేలు డివిజన్ పరిధిలో ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల్లో మల్చింగ్ విధానంలో సాగు చేశారు. అలాగే పోరుమామిళ్ల పరిధిలో 400 ఎకరాలు, మైదుకూరు పరిధిలో 400 ఎకరాలు, ముద్దనూరు పరిధిలో 500 ఎకరాలు విస్తీర్ణంలో వేంపల్లి పరిధిలో 200 ఎకరాలు, పులివెందుల పరిధిలో 300 ఎకరాలు కడప పరిధిలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణం మల్చింగ్ విధానం ద్వారా రైతులు సాగు చేశారు. అయితే మల్చింగ్ ఎకరాకు సుమారు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రోత్సాహకంగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ కూడా అందిస్తుండడంతో అన్నదాతలు మల్చింగ్ విధానం అవలంబించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రయోజనాలు అధికం

రైతులు మల్చింగ్ పద్ధతి ద్వారా ఉద్యాన పంటలు సాగు చేస్తే భూమిలో తేమను సంరక్షిస్తుంది, మొక్క తగిన వాతావరణాన్ని కల్పిస్తుంది. భూమిలో ఉండే చీడపీడలకు కారణమైన బ్యాక్టీరియాను నివారించవచ్చు. అలాగే మల్చింగ్ షీట్ పైభాగాన ఉన్న సిల్వర్ కలర్ వలన క్రిమి కీటకాలు నిర్మూలించవచ్చు. డ్రిప్ ద్వారా అందించే ఎరువులు పూర్తి స్థాయిలో మొక్కలకు చేరుతుంది. తద్వారా రైతులకు ఖర్చు ఆదా కావడంతోపాటు దిగుబడి కూడా పెరుగుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వలన కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు. మొక్కలకు వాటి జీవిత కాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో (20–50 శాతం) అధిక దిగుబడులు పొందవచ్చు. భూమిలో ఎల్లప్పుడూ తేమ నిల్వ ఉండడం వలన నేల గుల్లబారి వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది.

మల్చింగ్‌తో రైతులకు మేలు



మల్చింగ్ పద్ధతి ద్వారా రైతులు పండ్ల తోటలు, కూరగాయల తోటలు సాగు చేసుకుంటే కలుపు నివారణతో పాటు నీరు, ఎరువులు ఆదా అవుతాయి. కూలీల ఖర్చులు కూడా తగ్గుతాయి. ఆశించిన మేర దిగుబడి వస్తుంది. మల్చింగ్‌కు ప్రభుత్వం ఒక్కో రైతుకు ఐదు ఎకరాలకు మించకుండా 50 శాతం రాయితీ ఇస్తోంది. ఈ ఏడాది జిల్లాలో మల్చింగ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. **–జయభరతరెడ్డి, ఉద్యానశాఖాధికారి, బద్వేలు**

లాభదాయకమే



మల్చింగ్ ద్వారా ప్రస్తుతం 10 ఎకరాల్లో కుందన్ రకం దోస సాగు చేశాను. సాధారణ పద్ధతిలో సాగుచేస్తే కలుపు విపరీతంగా వస్తుంది. పంటలో వచ్చే సగం ఆదాయం కలపుతీతకే పోతుంది. ఈ పద్ధతిలో సాగుచేస్తే నీటి వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది. కష్టం తక్కువ, దిగుబడి ఎక్కువగా ఉంటుంది. **– చిన్నబయపురెడ్డి, దేవనగర్, అట్లూరు మండలం**

క్లుప్తంగా

నేడు సామూహిక అక్షరాభ్యాసం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ సరస్వతీ విద్యా మందిరంలోని సరస్వతీ దేవి ఆలయంలో సోమవారం వసంతపంచమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలుతో పాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. లోకకల్యాణార్థం గణపతి, సరస్వతీ, మంత్ర ప్రయుక్త గాయత్రీహోమం, పూర్ణాహుతి జరుగనుంది. ఉదయం 9 గంటలకు సరస్వతీ అష్టోత్తర పూజ, చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి ఆధ్వర్యంలో

బ్రహ్మంగారిమఠం: వసంత పంచమి సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలనుంచి చాపాడు మండలం పల్లవోలు గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరకుమార స్వామి చేతులమీదుగా ఉచిత అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచ్చిత అక్షర అభ్యాసానికి పిల్లలతో తల్లిదండ్రులు రావాలని కోరారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు, నిందితుడితో ఎస్‌ఐ

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన మేకల శాంతయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి మద్యం విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్నామని, మద్యంతో దొరికితే ఎంతటివారైన వదిలిపెట్టే ప్రసక్తి లేదని చెప్పారు.

మున్సిపల్ చైర్మన్‌కు మాతృవియోగం

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి వాకమళ్ల తులసమ్మ (85) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈమెకు దశరథరామిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి (బాబు) అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. తులసమ్మ మరణవార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీ పరిధిలోని పంగావాండ్లపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆటోలకు పోలీస్ నంబర్ తప్పనిసరి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ మోహన్

ఖాజీపేట : ఖాజీపేటలో తిరుగుతున్న ఆటోలకు పోలీస్ నెంబర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఖాజీపేట సీఐ మోహన్ సూచించారు. ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఖాజీపేటలో తిరుగుతున్న చాలా ఆటోలకు పోలీస్ గుర్తింపు నంబర్ లేవని అన్నారు. నంబర్ వలన ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, డ్రైవర్లకు మంచి ప్రయోజనాలు కలుగుతాయి అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు చేయాలన్నారు. ప్రయాణికులతో సన్నిహితంగా మెలగాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల ఖాజీపేట పరిసరాల్లో చోరీ జరుగుతున్నాయని, అనుమానాస్పదం ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం



మైదుకూరు: డప్పులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పోరుమామిళ్ల: ర్యాలీలో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు

మైదుకూరు: ప్రాణాలైనా అర్పించి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 7న జరిగే లక్ష డప్పులు – వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మైదుకూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని రాయల కూడలి నుంచి డప్పులను వాయిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కడప రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు, భాస్కర్, మాధవయ్య, నరసింహులు, చిన్నయ్య, సంజీవ్, జయరాముడు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో ర్యాలీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో ఆదివారం సాయంత్రం ఓఎల్‌ఎఫ్ పాఠశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ కమిటీ సభ్యుడు శోభన్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రబల్లె ఓబయ్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 7న జరగనున్న లక్ష డప్పులు– వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ నాయకులు దేవానందం, రాజా, రవీంద్ర, బాలజోజి, ఓబయ్య, ప్రసాద్, ఇన్నయ్య, మల్లి, గురయ్య, పాపయ్య, జాకబ్, ప్రకాష్‌రావు, నరసింహులు, గురయ్యపాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దువ్వూరు(చాపాడు): దువ్వూరు మండల పరిధిలోని గుడిపాడు, పుల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. గుడిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత తుమ్మల కొండారెడ్డి ఇటీవల గుండె సంబంధిత చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో దువ్వూరు సమీపంలోని పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వారి ఇళ్లకు పరామర్శించి వారి యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, బాబు, గుడిపాడు సర్పంచ్ మాబుషరీఫ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమకు తీరని అన్యాయం

అట్లూరు: కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాంద్‌బాషా విమర్శించారు. మండల పరిధిలోని అట్లూరు క్రాస్ రోడ్డులో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే కేవలం ఏడు లక్షల కోట్లు మాత్రమే సవరించారన్నారు. ఉపాది హామీకి నిధులు అధిక మొత్తంలో కేటాయించి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గేవన్నారు. ఉపాది హామీ అంటే ప్రధాని నరేంద్ర మోదీకి అందానీ, అంబానీ కార్పొరేటర్లకు ఉపాది కల్పించడమనని పేర్కొన్నారు. పేదల అభివృద్ధికి తోడ్పడే బడ్జెట్ కాకుండా కార్పొరేటర్లు అభివృద్ధికి తోడ్పడే బడ్జెట్‌ను ప్రవేశపట్టారని విమర్శించారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రమణ, లతా, విజయమ్మ, రవిచంద్రా, రామ్మోహన్, నిత్యా తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ప్రతిఒక్కరూ ఖండించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేసిన ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ వంటి వాటికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపించిందని అన్నారు. పేదల సంక్షేమానికి కేటాయింపుల్లో కూడా తీవ్రంగా కోత విధించారని, ఉద్యోగ, కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు రాయప్ప, సుబ్బరాయుడు, అనంతమ్మ, ఖైరున్‌బీ, నాగార్జున, ఆదిల్ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి పంచాయతీలోని గోవిందాయపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలురామిరెడ్డి కుమారుని వివాహానికి ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగడాలకు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్, ఎన్‌ఈపీ రద్దు కోసం ఉద్యమిస్తాం

కలసపాడు : ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన ఎన్‌ఈపీ, ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రమాదకారిగా పరిణమించిన సీపీఎస్ రద్దు కోసం జాతీయస్థాయిలో ఉద్యమిస్తామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు మహారాష్ట్రంలోని కొల్హాపూర్‌లో జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్ ఆర్డే అధ్యక్షతన జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సులో దేశంలోని 19 రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని దేశంలోని విద్యారంగ పరిస్థితులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చించామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ముఖ్యంగా ప్రాథమిక విద్యావ్యవస్థను కూకటివేళ్లతో పెకలింపజేసేలా తయారైన నూతన జాతీయ విద్యావిధానాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నార్థకమేనని హెచ్చరించారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. ఎస్టీయూ నాయకులు మధుసూదన్‌రాజు, సుబ్బారెడ్డి, వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి



సామాజిక సమరసత నిర్మాణానికి కృషిచేద్దాం

మైదుకూరు : సామాజిక సమరసత నిర్మాణానికి కృషిచేద్దామని హిందూ ధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మశ్రీ యోగానంద కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర సామాజిక సమరసత యాత్ర ఆదివారం మైదుకూరులో ప్రవేశించింది. ఈ సందర్భంగా సామాజిక సమరసత అనుసరించిన అనేక మంది మహనీయులలో బాబూజగ్జీవన్ రామ్, సర్దార్ నాగప్ప, దామోదరం సంజీవయ్య లాంటి వారి కృషి ఎనలేనిదని డాక్టర్ యోగానంద కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. అలాగే తన కీర్తనల ద్వారా సామాజిక సమరసతను చాటి చెప్పిన అన్నమయ్య, విశ్వమంతటికీ కాలజ్ఞానాన్ని అందించిన శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి నడియాడిన పుణ్య భూమి మనదని అన్నారు. సమరసత భావాన్ని దేశమంతా విస్తరింపజేసే క్రమంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ అఖిల భారత యోజనతో జరుగుతున్న 'సామాజిక సమరసత యాత్ర' ఉద్దేశమని చెప్పారు. శంకరానంద, లక్ష్మీపతి స్వామీజీ, శ్రీనివాస్‌రెడ్డి, చింతపర్తి మహేష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సుబ్బరాయుడు, రెడ్డి కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యోగానంద కృష్ణమాచార్యులు

ఫార్మసీ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కాలేజీ యాజమాన్యం విద్యార్థినికి హాల్ టికెట్ ఇవ్వకుండా వేధిస్తోందని, కాలజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా పరీక్షలకు హాజరవ్వకుండా చేస్తున్నాయన్నారు. కాలేజీలు విద్యార్థులను చేర్చుకునేటప్పుడు ఉచితంగా విద్యను అందిస్తామని, ఫీజు కట్టాల్సిన అవసరం లేదని చెప్పి చేర్చుకున్నారని తెలిపారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

పోరుమామిళ్ల: వసంతపంచమి సందర్భంగా ఆదివారం రామాయపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద ఏకల్ అభియాన్ ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సరస్వతీపూజ అనంతరం పిల్లలకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమ నిర్వాహకులు కడప అంచల్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కుర్రా చెన్నకృష్ణయ్య, తిరుపతయ్య, సమరసత ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని పేర్కొన్నారు. సరస్వతీ దేవి కటాక్షం పిల్లలపై ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి విగ్రహం వద్ద చిన్నారులు, ఏకల్ అంచల్ సభ్యులు

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : వాజ్‌పేయ్ నగర్‌లో పేకాట ఆడుతున్న 10 మందిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 15,900 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని సీఐ యుగంధర్ తెలిపారు.

నజీరుల్లా షా ట్రస్ట్ ఆస్తుల పరిరక్షణకు కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : నజీరుల్లా షా సాహెబ్ ట్రస్ట్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా షా మసీదు ఆవరణలో ట్రస్టు ఆస్తుల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నజీరుల్లా షా ప్రజలకు ఉపయోగ పడాలని 1944లో వీలునామా రాశారన్నారు. ట్రస్టు ఆస్తులు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రస్టు ఆస్తుల పరిరక్షణకు సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ చీఫ్ ఖాజీ ఇనాయతుల్లా, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ముక్తియార్. న్యాయవాది జిలానీబాషా, బొల్లవరం బాషా, ఇక్బాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

మహాసభలను జయప్రదం చేయండి

బ్రహ్మంగారిమఠం: శ్రీకాకుళంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దులపల్లె ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ఆదివారం బి, మఠంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిని ఫ్రీజోన్ చేసి రాష్ట్రంలోని అన్ని జిల్లావారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని కోరారు. టోనీ, ఓబులేసు, హరి, బాలరాజు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు